సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 7 । జనవరి । 2023



పించన్లతో ఆర్థిక భరోసా

ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పింఛ న్లతో ఆర్థిక భరోసా కలుగుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



గిరి భక్తులకు శ్రీవారి దర్శనం

రాజవొమ్మంగి: గిరి భక్తులు 400 మందికి శ్రీ వారి దర్శనం కల్పించినట్టు సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదాల నివారణ చర్యలు అభినందనీయం



• ఎస్పీ సతీష్‌కుమార్ 8లో

న్యూస్‌రీల్

బీఎస్‌ఎన్‌ఎల్‌లో రిజర్వేషన్లు విధిగా అమలు

• కమిటీ సమావేశంలో ఎంపీ మాధవి

కొయ్యూరు: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఎస్టీ,ఎస్సీలకు కేటాయించిన రిజర్వేషన్లను విధిగా అమలు చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. శుక్రవారం ఆమె ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ హాలులో నిర్వహించిన రిజర్వేషన్ల అమలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌లో ఎస్సీ,ఎస్టీలకు కేటాయించిన ఉద్యోగాలను వారితో భర్తీ చేయాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. దీనిలో ఎలాంటి వివక్ష చూపరాదని సూచించినట్టు ఆమె పేర్కొన్నారు.

పులుల నుంచి రక్షణ కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బూరుగు, చినకోనెల గ్రామస్తులు

అనంతగిరి: మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాల గిరిజనులు పులుల నుంచి తమకు రక్షణ కల్పించాలని శుక్రవారం ఆందోళన చేపట్టారు. గతమూడు రోజుల క్రితం పులులు దాడిలోని రెండు గ్రామాల్లో మూడు అవులు మృత్యువాతపడ్డాయని వారు వివరించారు. దీంతో గ్రామంలోని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని, తమకు రక్షణ కల్పించాలని, అలాగే రెండు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక చేయూత

• ఏజీఎం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం శ్రీనివాసరావు

చింతపల్లి: జిల్లాలోని రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఆర్థిక చేయూత నిస్తామని నాబార్డు ఏజీఎం శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సుగుమన, సాగరమౌళి, అరుణతార తదితర సంఘాలకు నాబార్డు ద్వారా రూ.3 లక్షల చొప్పున ప్రోత్సాహక సాయం అందించినట్టు చెప్పారు. ఈ నిధులతో కాఫీ, మిరియాలు, రాజ్‌మా వంటి గిరిజనుల ఉత్పత్తులు కొనుగోలు చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారు చేసి మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాలను సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అరుణాతార సీఈవో శ్రీనివాసరావు, ఎన్‌జీవో రాజు ప్రోగ్రాం అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

• ఆటో–బైక్ ఢీకొనడంతో ఘటన



గాయపడిన అరుణ్‌కు చికిత్స అందిస్తున్న 108 ఈఎన్‌టీ శ్రీను

జి.మాడుగుల: మండలంలో నుర్మతి–ఎన్ కొత్తూరు మధ్య ఎదురెదురుగా వస్తూ ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. మండలంలోని నుర్మతి గ్రామానికి చెందిన నుర్మని ఆరుణ్ బైక్‌పై శుక్రవారం గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఎన్ కొత్తూరు వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో అరుణ్‌కు గాయం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎన్‌టీ శ్రీను గాయపడిన అరుణ్‌కు ప్రథమ చికిత్స అందించారు. స్థానిక పీహెచ్‌సీకి తరలించి అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి పంపించారు.

లాభాల జోష్

అంతర్జాతీయ మార్కెట్లో క్లీన్ కాఫీకి గతేడాది మంచి ధర లభించడంతో రూ.6 కోట్ల మేర ఆదాయం పొందిన ఏపీఎఫ్‌డీసీ ఈ ఏడాది అదే జోష్‌తో క్యూరింగ్ పనులు మొదలు పెట్టింది. ఆ సంస్థకు చెందిన క్యూరింగ్ సెంటర్ తెలుగు రాష్ట్రాల్లోని నర్సీపట్నంలో మాత్రమే ఉన్నందున ప్రత్యేకత ఉంది. ఇక్కడ తయారయ్యే క్లీన్ కాఫీని అంతర్జాతీయ మార్కెట్‌కు తరలిస్తుంటారు.

• అంతర్జాతీయ మార్కెట్లో మన్యం క్లీన్ కాఫీకి భలే డిమాండ్
• గత సీజన్‌లో ఏపీఎఫ్‌డీసీకి రూ.6 కోట్ల మేర ఆదాయం
• ఈఏడాది అదే పరిస్థితి ఉండొచ్చని ఆశ
• నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌లో ఊపందుకున్న పనులు



ఎనిమిది విధాలుగా గ్రేడింగ్ చేసే ఆధునిక యంత్రం



మాన్యువల్ విధానంలో కాఫీ గింజలను వేరు చేస్తున్న మహిళా కార్మికులు

నర్సీపట్నం: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహిస్తున్న కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో పనులు ఊపందుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇది ఒక్కటే కావడంతో నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. వందలాది మంది కార్మికులకు ఆరు నెలల పాటు ఈ సెంటర్ ద్వారా ఉపాధి లభిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితి బాగుండడంతో రెండేళ్లగా అల్లూరి ఏజెన్సీ కాఫీ గింజలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

మన్యంలో కాఫీని సేకరిస్తూ..

మన్యంలో ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. అరాబికా, కావేరి, రొబస్టా రకాలను సాగు చేస్తున్నారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, ఆర్‌వీనగర్, చింతపల్లి డివిజన్‌ల్లో సేకరించిన కాఫీ గింజలను ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్పింగ్ సెంటర్లలో పైపార, తేమ శాతం తగ్గిస్తారు. తేమ 10 శాతానికి తగ్గే వరకు ఆరబెడతారు. అక్కడ నుంచి కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌కు తరలిస్తారు.

క్యూరింగ్ సెంటర్‌లో..

పల్పింగ్ సెంటర్ల నుంచి వచ్చిన కాఫీ గింజలను నాణ్యత ఆధారంగా గ్రేడింగ్ చేస్తారు. ఇక్కడ రెండు విధానాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. ముందు యంత్రాల సాయంతో, తరువాత మాన్యువల్ విధానంలో గ్రేడింగ్ చేస్తారు. పల్పింగ్ యూనిట్ల నుంచి వచ్చిన కాఫీ గింజలను తేమ లేకుండా క్యూరింగ్ సెంటర్ యార్డులో కొద్దిరోజులు ఎండబెడతారు. తేమశాతం తగ్గిన తరువాత యంత్ర సాయంతో వేరు చేస్తారు. ఇక్కడ ఎనిమిది గ్రేడ్‌ల్లో విభజిస్తారు. మొదటి నాలుగు గ్రేడ్‌లకు మాత్రమే ధర బాగుంటుందని క్యూరింగ్ సెంటర్ అధికారులు చెబుతున్నారు. ఈ గింజలను క్లీన్ కాఫీ అంటారు.

అంతర్జాతీయ మార్కెట్ ధర ఆధారంగా లావాదేవీలు

అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఆధారంగా వేలం విధానంలో లావాదేవీలు నిర్వహిస్తారు. పత్రిక ప్రకటన ద్వారా టెండర్లు ఆహ్వానించి వేలం నిర్వహిస్తారు. మార్కెట్ అవసరాల కన్నా బ్రెజిల్ దేశం నుంచి కాఫీ రావడంతో మన కాఫీకి గిరాకీ తగ్గింది. మూడేళ్లగా బ్రెజిల్ కాఫీ ఉత్పత్తి తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో అల్లూరి ఏజెన్సీ క్లీన్ కాఫీకి ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది కూడా గత ఏడాది కంటే ధర పెరగవచ్చని క్యూరింగ్ అధికారులు చెబుతున్నారు. మూడేళ్లలో కిలో కాఫీ ధరలు 2019–20లో రూ.200లు 2020–21లో రూ.184, 2021–22లో రూ.331 పలికింది. గతేడాది ధర కంటే పెరగవచ్చని ఏపీఎఫ్‌డీసీ అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ధర బాగుంది

> అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెజిల్ కాఫీ దిగుబడి తగ్గడంతో అల్లూరి ఏజెన్సీ కాఫీకి మూడేళ్లగా మంచి ధర వస్తోంది. క్యూరింగ్ పనులు డిసెంబరు 28 నుంచి ప్రారంభమయ్యాయి. గత ఏడాది మార్కెట్‌లో కిలో రూ.331 రేటు పలకడంతో 185 మెట్రిక్ టన్నులు విక్రయించగా ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 230 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీని విక్రయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.ప్రస్తుతం క్యూరింగ్ పనులు ఊపందుకున్నాయి. క్యూరింగ్ పనులు ఆరు నెలల పాటు కొనసాగుతాయి.
>
> – స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం

ఉధృతంగా చలిగాలులు



చలిమంట కాగుతున్న మన్యం వాసులు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. వాతావరణ మార్పులతో పగటి పూట చల్లదనం నెలకొంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలుల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు కురుస్తోంది. పాడేరు మండలం మినుములూరులో 12డిగ్రీలు, అరకులోయలో 15.2, చింతపల్లిలో 16డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి.

అంగన్‌వాడీ కార్యకర్త నియామకంపై ఫిర్యాదు

సాక్షి,పాడేరు: పెదబయలు మండలంలోని లక్ష్మీపేట అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుడి భార్యను నియమించారని పేర్కొంటూ కొంతమంది మహిళలు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి భార్యను అంగన్‌వాడీ కార్యకర్తగా నియమించడం అన్యాయమని మహిళలు అప్పలమ్మ, జ్యోతి, గంగాభవాని, కొండమ్మ తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్‌ను ఆదేశించారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం

• కలెక్టర్ సుమిత్‌కుమార్
• 158 స్వయం సహాయక సంఘాలకు లింకేజీ చెక్కులు
• రూ.1.2 కోట్ల మేర పంపిణీ



మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 158 స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి 20 లక్షల 66వేలు విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. రుణాలు సక్రమంగా చెల్లిస్తే తిరిగి ఎక్కువ మొత్తంలో మళ్లీ రుణాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద ముంచంగిపుట్టు మండలానికి చెందిన ముగ్గురు నిరుద్యోగ గిరిజన యువతకు రూ.6.60 లక్షల చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు. తాంగుల బాలన్నకు రూ.1.9 లక్షలు (గృహ నిర్మాణ రంగం), మతం లావణ్యకు రూ.2.8లక్షలు(ఆటో మొబైల్ సర్వీసింగ్), తాంగుల విశ్వనాథానికి రూ.1.9 లక్షలు (వాటర్ సర్వీసింగ్) నెలకొల్పేందుకు రుణాలు మంజూరు చేసినట్టు కలెక్టర్ వివరించారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అభిషేక్, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఎల్‌డీఎం రవితేజ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ నవీన్‌కుమార్, ఏపీఎం ప్రసాద్, మహిళ సంఘాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మారుమూల రోడ్లకు అధిక ప్రాధాన్యం

• ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
• అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
• బంట్రోతుపుట్టు – కుంతుర్ల రోడ్డు ప్రారంభం



బొంట్రోతుపుట్టు- కుంతుర్ల తారురోడ్డును ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మారుమూల గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం పాడేరు మండలం బంట్రోతుపుట్టు నుంచి కుంతుర్ల పంచాయతీ కేంద్రానికి రూ.2 కోట్లతో నిర్మించిన తారురోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తక్కువ వ్యవధిలో 26 తారురోడ్ల నిర్మాణం పూర్తిచేసినట్టు చెప్పారు. కుంతుర్ల, ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ పంచాయతీలకు తారు రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. కుంతుర్ల పంచాయతీలో మారుమూల గ్రామాలకు సుమారు రూ.7 కోట్లతో మట్టి రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు ఎమ్మెల్యే తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో అన్ని గ్రామాలకు సురక్షిత నీరు అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కుంతుర్ల పంచాయతీ కేంద్రంలో పోతురాజు పండగ సందర్భంగా వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. కుంతుర్ల పంచాయతీ పరిధిలోని ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరైన 456 మంది రైతులకు వాటిని పంపిణీ చేశారు. పర్యటన సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. పీఆర్‌ఈఈ టి. కొండయ్యపడాల్, డీఈ రామం.జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జె.సూర్యనారాయణ, ఏఈ సంజీవరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ కాసులమ్మ, ఎంపీటీసీ జ్యోతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ గంగాభవాని, నాయకులు సూరయ్య, అప్పారావు, కనకరాజు, రామన్న, అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

• గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



పెదబయలు గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

పెదబయలు: పదోతరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడేరు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ డి. కొండలరావు సూచించారు. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలించారు. టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థుల హాజరు పట్టీ, పాఠశాల రికార్డులను పరిశీలించారు. నూరు శాతం హాజరు ఉండేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పెదబయలు,ముంచంగిపుట్టు ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవ్వరికి అనారోగ్యంగా ఉన్న వెంటనే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని కోరారు. రాత్రి సమయాల్లో వాచ్‌మెన్లు సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ప్రిన్సిపాల్ మూర్తి. స్థానిక ప్రిన్సిపాల్ శంకరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాం తనిఖీ



గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల విభాగం అధికారులు

పెదబయలు: స్థానిక పౌర సరఫరాల గోదామును శుక్రవారం జిల్లా పౌర సరఫరాల విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తులసీ పద్మ, సాయి తనిఖీ చేశారు. జిల్లా గోదాం నుంచి వచ్చిన సరుకులు, ఇక్కడ నుంచి డీఆర్ డిపోలకు పంపిణీ సరకులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. గోదాంలో బియ్యం,పంచదార, కంది పప్పు నిల్వలు సక్రమంగానే ఉన్నట్టు పేర్కొన్నారు. సంక్రాంతి పండగకు ముందుగానే సరుకులు సరఫరా పూర్తి చేయాలని గోదాం ఇన్‌చార్జి దీనాకుమారిని ఆదేశించారు.

వైట్ బర్లీ కొనుగోళ్లు ప్రారంభం

• కిలో రూ.115 ధర
• ప్రకటించిన ప్రైవేట్ కంపెనీలు



రాజవొమ్మంగిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు

రాజవొమ్మంగి: మండలంలో వైట్ బర్లీ పొగాకు కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. రైతులు కిలో పొగాకు గరిష్ఠ ధర కనీసం రూ.125 పలుకుతుందని ఆశించారు. అయితే కంపెనీలో మాత్రం రూ.115 టాప్ రేట్ ప్రకటించాయి. తాటాకు పాకల్లో ఆరబెట్టి, బేళ్లుగా కట్టిన పొగాకును రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మండలంలో రాజవొమ్మంగి, లబ్బర్తి, వట్టిగెడ్డ, జడ్డంగి, అమీనాబాద్, కొయ్యూరు మండలంలోని బాలారం , కంతారంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొదటి రోజు వంద టన్నుల పొగాకును కంపెనీలు కొనుగోలు చేశాయి. ఈ ప్రాంతంలో రైతులు దాదాపు రెండు వేల ఎకరాల్లో బీబీహెచ్–8, బీబీహెచ్–3, వీ–5, బ్యాంకెట్ ఏ1 రకాలకు చెందిన వైట్ బర్లీ పొగాకు సాగు చేస్తున్నారు. ఏజెన్సీలో ప్రముఖ కంపెనీ ఐటీసీ, ఎంఎల్ వంటి పొగాకు కంపెనీలు ఈ పంటను ప్రోత్సహిస్తున్నాయి.

వసతి గృహంలో అక్రమాలు

• వేరే స్కూల్ విద్యార్థులకు ఇక్కడ హాజరు
• వారి పేరిట నిధులు పక్కదారి పట్టిస్తున్న వార్డెన్
• గౌరిదేవిపేటలో గుర్తించిన రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
• వీడియాకాల్ ద్వారా కలెక్టర్ దృష్టికి



వసతి గృహంలో సిద్ధం చేసిన రాత్రి భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: మండలంలోని గౌరిదేవిపేట సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో అక్రమాలు వెలుగుచూశాయి. వేరే స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను ఇక్కడ చేర్చుకుని నిధులు స్వాహా చేస్తున్నట్టుగా ఎమ్మెల్యే ధనలక్ష్మి పరిశీలనలో వెల్లడైంది. వెంటనే ఆమె కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో వార్డెన్‌పై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. మండలంలోని గౌరిదేవిపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో వార్డెన్ దానవబాబును ప్రశ్నించారు. ఆయన పొంతనలేని సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనానికి లోనయ్యారు. హాజరుపట్టీలో 40 మంది ఉన్నట్లు చూపి, రాత్రి భోజనం కేవలం ఎనిమిది మందికి మాత్రమే సిద్ధంచేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నందిగామ హైస్కూల్‌కు వాచ్‌మెన్‌ను పంపి విద్యార్థుల నుంచి బయోమెట్రిక్ హాజరుకు వేలిముద్రలు సేకరిస్తున్నారని నందిగామ గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇదేమిటని వార్డెన్, వాచ్‌మెన్‌ను నిలదీయడంతో వారినుంచి సరైన సమాధానం రాలేదు. హాస్టల్లో విద్యార్థులు తక్కువ మంది ఉంటున్నారని వార్డెన్ సక్రమంగా విధులకు రావడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో హాస్టల్‌లో పరిస్థితులను కలెక్టర్‌కు సుమిత్‌కుమార్‌కు ఎమ్మెల్యే వీడియోకాల్ ద్వారా వివరించారు. విచారణ జరిపి వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

నైపుణ్య రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ

• కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడి -8లో

స్పందన అర్జీలపై దృష్టి పెట్టండి

• సత్వర పరిష్కారానికి చర్యలు
• అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసు, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: స్పందనలో గిరిజనుల నుంచి స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ర సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పీవో ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనుల నుంచి 76 వినతులు స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. స్పందన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాస్తవ, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డీవీఆర్ఎం రాజు, లావణ్యకుమార్, కొండయ్యపడాల్, లీలాకృష్ణ, డీఈవో రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

• జి.కే.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ చుట్టిగొంది గ్రామానికి చెందిన గిరిజనులు గుండన్న, ప్రసాద్, త్రినాథ్ తాగునీటి సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందించారు.

• కొయ్యూరు మండలం వెలగలపాలెం గ్రామంలో పాతపంచాయతీ, కమ్యూనిటీ భవనాల శిథిలాల తొలగింపు పనులకు సంభందించిన బిల్లులను పంచాయతీ నుంచి చెల్లించాలని అర్జీ అందిండి.

• పెదబయలు మండలం పి.కోడాపల్లి పంచాయతీ పోయిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు మర్రి రాజారావు, అడ్సన్న, మర్రి రాజారావు, పాంగి అప్పలమ్మలు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

• సీడిగొంది గ్రామంలో 30 ఏళ్ల నుంచి సాగుచేస్తున్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని పాడేరు మండలం వర్తనాపల్లి గ్రామానికి చెందిన సరమండి శుభలక్ష్మి, తన తండ్రి బాలన్న అర్జీ అందజేశారు.

• పాతపాడేరు గ్రామానికి చెందిన కొర్రా కాంతమ్మ ఇంటి స్థలం మంజూరు చేయాలని విన్నవించుకుంది.

• అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ దాయర్తి గ్రామానికి సీసీడీపీ ద్వారా డీఆర్‌డిపో, అంగన్‌వాడీ భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని వినతి పత్రం అందింది. అంతేకాకుండా నాడు–నేడులో పాఠశాల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరారు.

పింఛన్లతో ఆర్థిక భరోసా

కొయ్యూరు: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్లతో ఆర్థిక భరోసా కలుగుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన 600 కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరవుతున్నాయన్నారు. పింఛన్ల పంపిణీపై టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. పాడేరు నియోజకవర్గంలో నెలకు 37,926 మందికి సామాజిక భద్రత పింఛన్లు అందజేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏటా పింఛన్ సొమ్మును పెంచుతున్నారన్నారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 540 రకాల సేవలందుతున్నాయన్నారు. ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో పాటు ఉపాధి, ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం ముందువరుసలో ఉందన్నారు. చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, ఎంపీడీవో మేరీరోజ్ తదితరులు పాల్గొన్నారు.


కుంతర్లలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


నూనెవారిగుడెం గ్రామంలో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పెదబయలు: కుంతుర్ల పంచాయతీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లకు సంబంధించిన నగదులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్ని సంక్షేమ పథకాలు నేరుగా ఖాతాల్లో జమ అవుతుందన్నారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు చేరువు అవుతున్నట్టు తెలిపారు. గ్రామ సచివాలయం నిర్మాణం వేగవంతం చేయాలని ఇంజినీర్లను కోరారు.

వీఆర్ పురం: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చింతూరు, వీఆర్ పురం మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కొత్త పింఛన్లను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో అన్ని అర్హతలున్నా పింఛన్లు మంజూరు కాని పరిస్థితి ఉండేదని లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందిస్తున్న స్థితి ఉందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సచివాలయ కన్వీనర్లు గ్రామ వలంటీర్లతో కలిసి సమష్టిగా పనిచేసి సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చూడాలన్నారు. మండలంలోని అన్నవరం వాగుపై ప్రస్తుతం ఉన్న సప్టా ప్రక్కన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

చింతూరుకు-215 ,వీఆర్ పురం మండలానికి-39 కొత్త పింఛన్‌లు మంజూరైనట్టు చెప్పారు. మండలంలోని ముంపు గ్రామల పరిస్థితిని సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీడీవోలు ఫణీంద్ర, రవిబాబు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, బి.వెంకటేష్ , ఎంపీపీలు సవలం అమల , కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ,సర్పంచ్‌లు జయ, నరసమ్మ, రామారావు, బాలరాజు, శారద, చింతూరు మండల పార్టీ కన్వీనర్ వై.రామలింగారెడ్డి, నాయకులు మురళి, బాలు, సత్యనారాయణ, జయరాజ్, బాలాజీ, వెంగళరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కూనవరం, ఎటపాక మండలాలకు ప్రభుత్వం మంజూరు చేసిన 64 కొత్త పింఛన్లను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీలు కాక కామేశ్వరి, పాయం రంగమ్మ, జెడ్పీటీసీలు సుస్మిత, విజయ, ఎంపీడీఓలు విఠల్‌పాల్, ఫణీంద్ర, ఎంపీటీసీలు, మండల పార్టీ కన్వీనర్ వాసు, సొసైటి చైర్మన్ వెంకట రామారావు, నాయకులు నర్సింహారావు, అప్పలరెడ్డి, నాయక్, శేషగిరి, పాపారావు, నాగేశ్వరరావు ,రాంబాబు, వెంకట్, శివ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు అభినందనీయం

- ఎస్పీ సతీష్‌కుమార్
- పలువురికి రివార్డు

అనంతగిరి: ప్రమాదాల నివారణ చర్యలు అభినందనీయమని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పాడేరు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం అనంతగిరి మండలంలోని జీనబాడు పంచాయతీ సర్పంచ్ మాధవి, సరియా జలపాతం వలంటీర్లకు రివార్డు అందజేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతంలోని గతంలోని 25 మంది వరకు పర్యాటకులు ప్రమాదవశాత్తూ జారిపడి ప్రాణాలు కోల్పోయారు. అనంతగిరి ఎస్ఐ కరక రాము ఆధ్వర్యంలో జీనబాడు సర్పంచ్ చొరవతో సరియా జలపాతం వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదకరమైన ప్రదేశాలను మూసివేయడంతో పాటుగా ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టారు. జలపాతం వద్ద వలంటీర్లను ఏర్పాటు చేసి, పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈసందర్భంగా ఎస్ఐ రామును అభినందించారు. సర్పంచ్ మాధవి, వలంటీర్లకు రివార్డును అందజేశారుఅరకు సీఐ దేముడుబాబు, సరియా వలంటీర్లు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

- ప్రేమించిన వ్యక్తి మోసగించాడని మనస్తాపం
- కొద్ది రోజుల కిందట పోలీసుల కౌన్సెలింగ్

కొయ్యూరు : ప్రేమించిన వ్యక్తి వివాహానికి నిరాకరించడంతో మంపకు చెందిన ఎస్.కె రసూల్ బీబీ (25) శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కొంతకాలంగా బీబీ అదే గ్రామానికి చెందిన గాడి శ్రీను ప్రేమించుకుంటున్నారు. శారీరకంగా ఒక్కటయ్యారు. అయితే కొంతకాలంగా శ్రీను రసూల్‌బీబీని వదిలించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. దీనిపై బీబీ తల్లిదండ్రులు నాగూర్, కన్నార్‌బీలు మంప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సమస్యను పెద్దల సమక్షంలో పరిష్కారం చేసుకుంటామని వారు పోలీసులకు తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్థాపం చెందిన బీబీ ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెను తల్లిదండ్రులు వెంటనే రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ తాము ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. అయితే వారు గ్రామ పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారం చేసుకుంటామని తెలిపారని, ఇంతలోనే బీబీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. కాగా బీబీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఇది రెండోసారని తల్లిదండ్రులు తెలిపారు. గతంలో ఒకసారి చేసుకుని ప్రాణాలతో బయటపడిందన్నారు.

నైపుణ్య రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ

పాడేరు రూరల్ : నైపుణ్య రంగాల్లో ఆసక్తి గల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమో అర్హత కలిగిన విద్యార్థులకు పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్విచక్రా వాహనాల సర్వీస్ టెక్నీషియన్ రంగంలో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో బస్ పాస్ సౌకర్యం కూడా కల్పిస్తామని ఆయన వెల్లడించారు. డిగ్రీ అర్హత గల యువతకు అరకువ్యాలీ వైటీసీలో హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ అవుట్ లెట్ మేనేజర్ రంగాల్లో శిక్షణ అందిస్తామని చెప్పారు. హౌస్ కీపింగ్‌లో ఆరు నెలలు, ఫుడ్ అవుట్‌లెట్ విభాగంలో ఐదు నెలల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వీరికి శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అర్హులైన యువతీ,యువకులు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు పి.నవీన్‌కుమార్‌ను 9491786463 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

మోతుగూడెం ఎస్ఐకు ఉత్తమ అవార్డు


ఎస్పీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ సత్తిబాబు

మోతుగూడెం: ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా స్థానిక ఎస్ఐ వి.సత్తిబాబు ఉత్తమ అవార్డు అందుకున్నారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు స్వీకరించారు. ఉత్తమ అవార్డు స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

త్వరితగతిన కల్వర్టు పనులు

కూనవరం: కొండరెడ్ల కుగ్రామం టేకులొద్దిలో కల్వర్టు నిర్మాణ పనులకు ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ (ఐటీడీఏ) సింహాచలం మార్కింగ్ పనులు చేయించారు. ఆయన మాట్లాడుతూ 2022 నాబార్డు నిధుల నుంచి రూ.50 లక్షల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. వరదల్లో రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యేవారని, సమస్య పరిష్కారానికి కల్వర్టు నిర్మిస్తున్నామని, మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. ఏఈ కె ప్రవీణ్, టీఏ డి.ప్రవీణ్, కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.


టెకులొద్ది గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి మార్కింగ్ చేయిస్తున్న అధికారుల

ఖాతాదారులకు మెరుగైన సేవలు

గూడెంకొత్తవీధి: యూకోబ్యాంకు 80 వసంతాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గూడెం కొత్తవీధిలో బ్రాంచి అధికారులు ప్రత్యేక వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ మహేష్‌బాబు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు.రుణాలను తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో తిరిగి చెల్లించిన వెంటనే మళ్లీ వారికి రుణాలను అందిస్తున్నామన్నారు. సహాయ మేనేజరు సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


బ్యాంకు వేడుకల్లో బీఎం మహేష్‌బాబు, సహాయ మేనేజరు సంతోష్‌కుమార్, సిబ్బంది

కాఫీ సాగు విస్తరణకు కృషి


అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాఫీ ఏడీ అశోక్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని కాఫీ పంట సాగు విస్తరణతో పాటు, అధిక దిగుబడులు లక్ష్యంగా పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం కృషి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఇటీవల ఐటీడీఏ కాఫీ ఏడీగా బాధ్యతలు చేపట్టిన అశోక్ శుక్రవారం అరకులోయ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాఫీ సాగు ద్వారా గిరిజనులకు ఏటా మంచి ఆదాయం నెలకొంటుందని, గిట్టుబాటు ధర కల్పించి, నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

వంజంగిలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేపట్టిన వలంటీర్లతో ఎంపీడీవో సాయి నవీన్

పాడేరు రూరల్: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పర్యాటక ప్రాంతమైన వంజంగి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో కె.సాయినవీన్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, టూరిజం వలంటీర్లు పాల్గొని పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పర్యాటకులు పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ఎంపీడీవో సాయినవీన్ సూచించారు.

వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు లైసెన్స్ తప్పనిసరి

పాడేరు రూరల్ : పాడేరు, జి.మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పాడేరు, జి. మాడుగుల మండలాల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులు తప్పనిసరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ లైసెన్స్ పొంది ఉండాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు అన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వారపు సంతాల్లో గిరిజన రైతులు దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతుల నుండి వ్యాపారస్తులు కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులు మోసాలకు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బట్టి కొండబాబు, డైరెక్టర్లు గబ్బాడ రాజారావు, లకే రామసత్యవతి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సేవలతో అవస్థలు

కొయ్యూరు: రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రాండ్‌బ్యాండ్ సేవలు స్తంభించడంతో స్థానిక బ్యాంకులో సేవలు నిలిచాయి. ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక అనేక కార్యాలయాలకు బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఉన్నాయి. నెట్ పనిచేయకపోవడంతో వాటికి కూడా అంతరాయం కలిగింది. కొద్ది రోజుల కిందట ఇదే విధంగా సేవలు నిలిచిపోయాయని, తరచూ సమస్య తలెత్తుతోందని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు

చోడవరం రూరల్ : అక్రమంగా అధికంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు చెప్పారు. పట్టణంలోని తామరచెరువు వీధి వద్ద జుత్తాడ గ్రామానికి చెందిన జామి పట్టాభిరామ్ అనే వ్యక్తి వద్ద అధికంగా 12 క్వార్టర్ బాటిళ్ల మద్యం ఉండడంతో హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి గురువారం రాత్రి సోదా చేసి మద్యం పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.